ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 273

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
02 నవంబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## ఈసారి వదలొద్దు.. నేడు వన్డే ప్రపంచకప్ ఫైనల్

- దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ - ఫేవరేట్‌గా టీమ్ఇండియా
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్ , జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం..




2 లో

# అభివృద్ధికి అవకాశమివ్వండి

- భారత రాష్ట్ర సమితికి మూడుసార్లు పట్టం కట్టారు.. ఇప్పుడు కాంగ్రెస్‌ను గెలిపించండి
- జూబ్లీహిల్స్‌లో సమస్యలకు కేసీఆర్, కేటీఆర్‌లదే బాధ్యత
- పోలింగ్‌లోగా కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెస్తారో చూద్దాం
- బోరబండ, ఎర్రగడ్డ ప్రచార సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి..

వివరాలు 2లో




శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట

- 9 మంది మృతి.. 25 మందికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఎనిమిది మంది మహిళలు, బాలుడు
- కార్తిక ఏకాదశి సందర్భంగా 15వేల మంది రాక
- వెళ్లడానికి, తిరిగి రావడానికి ఒకటే దారి కావడంతో ప్రమాదం



2 లో

## అక్రమ కేసులతో మహిళలను భయపెడుతున్నారు

- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- కోల్ ఇండియా దేశానికే గర్వకారణం: కిషన్‌రెడ్డి

2 లో




# బెదిరిస్తే సంగతి తేలుస్తం..

- గూండాలు, రౌడీలకు కేటీఆర్ హెచ్చరిక
- జూబ్లీహిల్స్ ప్రజలకు అండగా తెలంగాణభవన్
- ఏమిచ్చిండ్రని పథకాలను రద్దు చేస్తరు?
- అత్తకు 4 వేలు, కోడలుకు 2500 ఇస్తున్నరా?
- తులం బంగారం? స్కూటీలు ఇచ్చిండ్రా?
- బ్లాక్‌మెయిలర్లకు కర్రుకాల్చి వాత పెట్టాలె
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ రాకుండా ఓడిస్తే 500 రోజుల్లో కేసీఆర్ సీఎంగా వస్తరు
- బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలె
- రహమత్‌నగర్ రోడ్ షోలో కేటీఆర్ పిలుపు

2 లో



# అభివృద్ధికి అవకాశమివ్వండి

హైదరాబాద్ :
"జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఓటర్లుగా మూడుసార్లు భారత రాష్ట్ర సమితికి అవకాశమిచ్చి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారు. పేదప్రజలకు ఆయన ఎలాంటి సేవలు అందించలేదు. నాకు మంచి స్నేహితుడైనప్పటికీ ఒక్కసారి కూడా నియోజకవర్గానికి నిధులు కావాలని శాసనసభలో అడగలేదు. రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలంటూ ఎప్పుడూ లేఖ కూడా ఇవ్వలేదు. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని గెలిపించండి. మీరు నవీన్ యాదవ్‌కు 30 వేల ఓట్ల మెజారిటీతో ఘనవిజయాన్ని అందించండి. నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఆయన ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తారు. ఒక్కసారి అవకాశం ఇస్తే రూ.వందల కోట్ల నిధులు తీసుకొస్తాం. అభివృద్ధి పనులన్నింటినీ నేను దగ్గరుండి చేయిస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శనివారం ఆయన బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో నిర్వహించిన కూడలి సమావేశాల్లో ప్రసంగించారు. "జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నిక సందర్భంగా మాగంటి సునీతను గెలిపించాలని భారత రాష్ట్ర సమితి నాయకులు సానుభూతి అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారు. సొంత ఆడబిడ్డను కుటుంబం నుంచి, పార్టీ నుంచి వెలివేసిన కేటీఆర్, హరీశ్‌రావు మాయమాటలు చెబుతున్నారు. వారి కల్లబొల్లి మాటలకు లొంగకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలి.

ఇక్కడి సమస్యలు.. వారి పాపమే

గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పి కారును షెడ్డుకు పంపారు. దీంతో సహనం కోల్పోయిన బిల్లా..రంగాలు బెంజ్ కార్లు వదిలేసి జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఆటోల్లో తిరుగుతున్నారు. నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలున్నాయంటూ ప్రచారం చేస్తున్నారు. ఇవి కొత్తగా రాలేదు. భారత రాష్ట్ర సమితి నాయకులు అభివృద్ధి, సంక్షేమాలను గాలికి వదిలేశారు. ప్రతి డివిజన్‌లోనూ సమస్యలు పేరుకుపోయాయంటే తండ్రీకుమారులదే బాధ్యత. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్‌కార్డులిచ్చాం. ఓఆర్ఆర్ , శంషాబాద్ విమానాశ్రయం, మెట్రోరైల్ మేమే తెచ్చాం. ఇక హైదరాబాద్‌లో గరీబోళ్ల గుండె చప్పుడు పి.జనార్దన్‌రెడ్డి మరణిస్తే ఉపఎన్నికలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థిని నిలబెట్టింది. అప్పుడు సానుభూతి గుర్తుకు రాలేదా? పీజేఆర్ చేసిన సేవలకు గుర్తుగా బోరబండ కూడలిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తాం. పీజేఆర్‌లా పేద ప్రజలకు సేవ చేయాలంటే నవీన్ యాదవ్‌ను గెలిపించాలి.

జూబ్లీహిల్స్‌కు ఎన్ని నిధులిచ్చారో కిషన్‌రెడ్డి చెప్పాలి

కేంద్రమంత్రిగా రెండోసారి పనిచేస్తున్న కిషన్‌రెడ్డి.. ఆయన నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్‌కు ఎన్ని నిధులిచ్చారో లెక్కచెప్పాలి. పోలింగ్‌లోగా నియోజకవర్గానికి ఎన్ని పైసలు తెస్తారో చూద్దాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే మీకెందుకు ఇబ్బంది? మైనార్టీల ఓట్లు మీకు రావు. భారత రాష్ట్ర సమితికి ఓట్లు వేయించేందుకే ఇదంతా చేస్తున్నారు. ఉప ఎన్నికలో భాజపా డిపాజిట్ కోల్పోవడం ఖాయం.

అంతేకాదు.. 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ చెప్పిన ఆ పార్టీకి ఓట్లు వేయకండి. ఈ ఎన్నికల్లో ఒకవైపు మోదీ, కేసీఆర్.. మరోవైపు రాహుల్, రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఆలోచించి నిర్ణయం తీసుకోండి' అంటూ ఓటర్లకు సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో మంత్రి అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసారి వదలొద్దు.. నేడు వన్డే ప్రపంచకప్ ఫైనల్

మహిళల వన్డే ప్రపంచకప్‌లో టైటిల్ పోరుకు వేళైంది. నెలరోజులుగా జరుగుతున్న ఈ టోర్నీలో పడుతూ లేస్తూ ఫైనల్ చేరిన భారత్, దక్షిణాఫ్రికా.. కొత్త చరిత్రను లిఖించేందుకు ఒకే ఒక విజయం దూరంలో నిలిచాయి. రెండుసార్లు టైటిల్‌కు చేరువగా వచ్చినా విఫలమై మూడో ప్రయత్నంలో అయినా సొంతగడ్డపై ట్రోఫీని సగర్వంగా ముద్దాడాలన్న లక్ష్యంతో భారత జట్టు ఉంటే.. మొదటిసారి ఈ టోర్నీ ఫైనల్ ఆడుతున్న సఫారీలూ కప్పును ఎగిరేసుకుపోయేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నారు. ఈ ఇరుజట్లలో ఎవరు గెలిచినా ప్రపంచం కొత్త చాంపియన్‌ను చూడబోతున్న నేపథ్యంలో ఫినిషింగ్ టచ్ ఎవరిదవుతుందన్నది ఆసక్తికరం.

ముంబై: భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ తుది అంకానికి చేరుకుంది. నెలరోజులుగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఈ మెగా టోర్నీలో ఆదివారం టైటిల్ పోరు జరుగనుంది. అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ ఫైనల్ చేరిన భారత్, దక్షిణాఫ్రికా.. తమ తొలి ఐసీసీ ట్రోఫీ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. 13వ ఎడిషన్‌గా జరుగుతున్న ఈ టోర్నీ సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్, ఏడు సార్లు విజేత ఆస్ట్రేలియాను మట్టికరిపించిన భారత్.. 4 సార్లు కప్ గెలిచిన ఇంగ్లండ్‌ను చిత్తుచేసిన దక్షిణాఫ్రికా.. కొత్త చరిత్ర సృష్టించడానికి సిద్ధమయ్యాయి. నవీ ముంబైలోని డాక్టర్ డీవై పాటిల్ స్టేడియం ఇందుకు వేదిక కానుంది. ఆసీస్, ఇంగ్లండ్ లేకుండా తొలిసారిగా వన్డే ప్రపంచకప్ ఫైనల్ జరుగుతుండగా.. ఈ మ్యాచ్‌లో భారత్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నది.

ఔర్ ఏక్ ధక్కా.. ట్రోఫీ పక్కా

పురుషుల క్రికెట్‌ను శాసించే స్థాయికి ఎదిగిన భారత జట్టు.. మహిళా క్రికెట్‌లో మాత్రం ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నది. ఇన్నాళ్లూ అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని అందిపుచ్చుకుంటే అమ్మాయిల క్రికెట్ దశ తిరిగినట్టే! భారత క్రికెట్‌ను 1983 వరల్డ్ కప్ విజయం ఎంత ప్రభావితం చేసిందో.. అమ్మాయిలకూ అలాంటి ఒక క్షణం కోసం అభిమానులు కోట్లాది కండ్లతో వేచి చూస్తున్నారు. 2005లో ఫైనల్ చేరి విఫలమైనా.. 2017 వన్డే ప్రపంచకప్‌లో ట్రోఫీకి అత్యంత చేరువగా వచ్చినా 9 పరుగుల స్వల్ప తేడాతో కప్పును చేజార్చుకుంది.

కానీ అరుదుగా వచ్చే ఇలాంటి అవకాశాలను హర్మన్‌ప్రీత్ సేన ఎలా ఉపయోగించుకుంటుందో చూడాలి. 2017 ఫైనల్‌లో ఆడిన వారిలో హర్మన్, స్మృతి, దీప్తి శర్మ ప్రస్తుత జట్టులోనూ సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుత ఎడిషన్‌లో వారికి తోడు జెమీమా, రిచా, షెఫాలీ వర్మ రూపంలో భారత బ్యాటింగ్ దుర్భేధ్యంగానే ఉంది. ఇదే జోరును ఫైనల్‌లోనూ కొనసాగిస్తే అమ్మాయిల కల తీరినట్టే! బ్యాటింగ్ విషయంలో భారత్‌కు బెంగేమీ లేకున్నా బౌలింగ్ ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళనకు గురిచేసేదే. ఫైనల్‌లో రేణుకా సారథ్యంలోని బౌలింగ్ దళం ఏ మేరకు సఫారీలను కట్టడి చేయగలుగుతుందనేదానిపై భారత విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

సఫారీలను తేలిగ్గా తీసుకోవద్దు.. సెమీస్‌లో ఆసీస్‌ను ఓడించిన విజయోత్సవంతో ఫైనల్‌కు వచ్చిన భారత్.. దక్షిణాఫ్రికాను తేలిగ్గా తీసుకుంటే పప్పులో కాలేసినట్టే. కెప్టెన్ లారా వోల్వార్డ్ (470 రన్స్) సూపర్ ఫామ్‌లో ఉండగా తజ్మిన్ బ్రిట్స్ (212)కు తోడు వెటరన్ ఆల్‌రౌండర్ మరిజనె కాప్ (204 రన్స్, 12 వికెట్లు), నదినె డి క్లార్క్ (190 రన్స్, 8 వికెట్లు), ట్రైయాన్ (167 రన్స్, 5 వికెట్లు) వంటి స్టార్ ఆల్‌రౌండర్లు ఆ జట్టు సొంతం. మ్యాచ్‌ను ఏ క్షణంలో మలుపు తిప్పగలగడంలో వీళ్లు దిట్ట. గ్రూప్ దశలో నదినె, ట్రైయాన్ జోడీ.. అవకాశాలే లేని చోట సఫారీలను విజయాతీరాలకు చేర్చి భారత్‌కు షాకిచ్చిన విషయాన్ని మరువరాదు.

పిచ్, వాతావరణం.. డీవై పాటిల్ పిచ్ బ్యాటర్లకు స్వర్గధామం. ఇక్కడ మరోసారి భారీ స్కోర్లు నమోదయ్యే ఛాన్స్ ఎక్కువే. ముంబైలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం కూడా వరుణుడు సాయంత్రం 5 గంటల తర్వాత ఆటకు అంతరాయం కల్గించే ప్రమాదం లేకపోలేదు. అయితే ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే కూడా ఉంది.

చరిత్ర సృష్టించేదేవరో?.. ఈ టోర్నీలో భారత్, దక్షిణాఫ్రికా ప్రయాణం దాదాపు ఒకేలా ఉంది. ఆరంభంలో బంగ్లాదేశ్, శ్రీలంక వంటి జట్లపై విజయాల తర్వాత ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకున్న టీమ్‌ఇండియా.. కివీస్‌పై గెలుపుతో రేసులోకి వచ్చింది. సెమీస్‌లో అరవీర భయంకర ఆస్ట్రేలియా నిర్దేశించిన రికార్డు లక్ష్య ఛేదన (338)ను మరో ఆరు బంతులుండగానే ఛేదించి ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచింది. మరోవైపు దక్షిణాఫ్రికాదీ అదే పరిస్థితి. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు 69 రన్స్ (ఇంగ్లండ్‌తో)కే ఆలౌట్ అయి ఓటమితో టోర్నీని ఆరంభించింది. కానీ ఆ తర్వాత సఫారీలు పుంజుకున్న తీరు అద్భుతం. తొలి సెమీస్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చి సగర్వంగా తమ తొలి వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

## శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట

**శ్రీకాకుళం:**
శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మరణించగా, 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎనిమిది మంది మహిళలు, ఓ బాలుడు ఉన్నారు. కార్తిక ఏకాదశి సందర్భంగా స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఉదయం నుంచి ఆలయం కిటకిటలాడింది. భక్తులంతా ఒకేసారి ఆలయంలోకి ప్రవేశించే క్రమంలో ఉదయం 11.45 గంటలకు తోపులాట జరిగి.. అది తొక్కిసలాటకు దారితీసింది.

రెయిలింగ్ కూలడంతో ప్రమాదం: హరిముకుంద పండా అనే వ్యక్తి నిర్మించిన ఈ ఆలయాన్ని నాలుగు నెలల కిందటే ప్రారంభించారు. ఇప్పటివరకు ఏరోజూ 2వేలకు మించి భక్తులు రాలేదు. మంచిరోజు అన్న భావనతో ఒక్కసారిగా 15వేల మందికిపైగా తరలివచ్చారు.

ఆలయంలోకి వెళ్లడానికి, తిరిగి రావడానికి 12 అడుగుల మెట్ల మార్గమే ఉంది. అక్కడ స్టీల్ రెయిలింగ్ ఏర్పాటుచేశారు. వెళ్లేవారు, బయటకు వచ్చేవారి తాకిడి తట్టుకోలేక రెయిలింగ్ విరిగిపోయింది. దాంతో మెట్లపై నుంచి భక్తులు ఒకరిపై ఒకరు పడిపోయారు. పడిపోయిన రెయిలింగ్ కింద కొందరు ఇరుక్కుపోయారు. తొక్కిసలాటలో భక్తులు కాళ్ల కింద నలిగిపోయి ఊపిరాడక విలవిల్లాడిపోయారు. ఆలయ ఆవరణలో వారి హాహాకారాలు మిన్నంటాయి. ఘటనా స్థలంలోనే ఏడుగురు, ఆసుపత్రిలో మరో ఇద్దరు చనిపోయారు. గాయపడిన వారిలో చాలామందికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని టెక్కలి, శ్రీకాకుళం ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులకు పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు.

విషయం తెలియగానే నందిగాం మండలంలో పింఛన్ల పంపిణీలో ఉన్న మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి ఓదార్చారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆలయం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వివరాలు తెలుసుకుని.. సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

ఏప్రిల్‌లోనే ప్రారంభం.. అంతలోనే విషాదం

కాశీబుగ్గలోని విజయ వేంకటేశ్వరాలయాన్ని 'ఉద్దానం చిన్న తిరుపతి'గా పిలుస్తారు. దీన్ని కాశీబుగ్గకు చెందిన హరిముకుంద పండా తన ఎస్టేట్‌లోని 12.40 ఎకరాల్లో నిర్మించారు. ఓసారి తిరుపతి వెళ్లినప్పుడు శ్రీవారి దర్శనం సరిగ్గా జరగలేదు. దాంతో తానే ఆలయం కట్టాలనుకుని.. 2017లో పునాది వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఆలయాన్ని ప్రారంభించారు. 2వేల మంది సామర్థ్యం ఉన్న ఈ ఆలయానికి ఏకాదశి సందర్భంగా 15వేల మందికి పైగా రావడంతో తోపులాట చేసుకుంది. ఘటన జరిగాక ఆలయ ఆవరణలోనే ఉన్న 92 ఏళ్ల హరిముకుంద పండాతో కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు.

ఆలయానికి రోజుకు రెండువేల మంది వరకు వస్తుంటారు. భక్తులకు ప్రసాదవితరణ చేసి పంపిస్తాను. ఇలా జరగడం దురదృష్టకరం. ఇంతమంది వస్తారని అసలు ఊహించలేదు. అందుకే పోలీసులకూ సమాచారం ఇవ్వలేదు.

మృతుల వివరాలు
ఏదూరు చిన్నమ్మి (50), రామేశ్వరం, టెక్కలి మండలం
రాపాక విజయ (48), పిట్టలసరియా, టెక్కలి మండలం
మురిపింటి నీలమ్మ (60), దుక్కవానిపేట, వజ్రపుకొత్తూరు మండలం
దువ్వు రాజేశ్వరి (60), బెల్లుపటియ, మందస మండలం
చిన్ని యశోదమ్మ (56), శివరాంపురం, నందిగాం మండలం
రూప (21), గుడ్డిభద్ర, ఒడిశా
బోర బృంద (67), బోయవీధి, మందస
డొక్కర అమ్ములమ్మ (55), సూర్యాకాలనీ, పలాస
లొట్ల నిఖిల్ (13), బెంకిలి, సోంపేట మండలం

సీఎం తీవ్ర దిగ్భ్రాంతి: మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.. కాశీబుగ్గలోని ఆలయంలో తొక్కిసలాటపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో 'పేదల సేవలో' కార్యక్రమానికి హాజరైన సీఎం ఈ దుర్ఘటనపై స్పందించారు.

# బెదిరిస్తే సంగతి తేలుస్తం..

**ఏఎం న్యూస్, హైదరాబాద్, నవంబర్ 1 :**
జూబ్లీహిల్స్ ప్రజలను ఎవరైనా రౌడీలు, గూండాలు బెదిరిస్తే, ఇబ్బంది పెడితే పకనే బంజారాహిల్స్‌లో ఉన్న తెలంగాణభవన్ అనే జనతా గ్యారేజ్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం అందరం వచ్చి వారి సంగతి తేలుస్తామని హెచ్చరించారు. 'ఇప్పుడే ఒక సర్వే వచ్చింది. మన గెలుపు భారీగా ఉండబోతున్నట్టు ఆ సర్వేలో తేలింది. జూబ్లీహిల్స్‌లో 4 లక్షల మంది ఓటేస్తే 4 కోట్ల మందికి మేలు జరుగుతుంది. కాంగ్రెస్‌ను దెబ్బ కొడితేనే వాళ్లు మనకు ఇచ్చిన హామీలు అమలవుతాయి. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే మేం ఏం చేయక పోయినా నాకే ఓటేస్తారనుకొని రేవంత్ ఏ పనీచేయరు. అందుకే ఆలోచించి ఓటేయండి. హైడ్రా పేరు చెప్పి పేదల ఇండ్లు కూలగొడుతున్నారు. హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్‌ను, అన్ని వ్యాపారాలను నాశనం చేశారు. బుల్డోజర్ ఎప్పుడు వచ్చి తమ ఇంటిని కూలగొడుతుందో అని ప్రజలు కంటిమీద కునుకులేకుండా భయంభయంగా గడుపుతున్నారు' అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. రహమత్‌నగర్ డివిజన్‌లో ఎస్పీఆర్ హిల్స్ నుంచి శ్రీరామ్‌నగర్ బస్టాండ్ వరకు రోడ్ షో నిర్వహించిన కేటీఆర్.. అక్కడికి భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఏం చేశారని రద్దు చేస్తారు?

'రద్దు చేస్తా.. రద్దు చేస్తా అంటున్నరు. ఏం షురూ చేసినరని రద్దు చేస్తరు' అని కాంగ్రెస్‌ను కేటీఆర్ నిలదీశారు. అత్తకు రూ. 4 వేలు ఇస్తున్నరా? కోడలుకు రూ.2,500 వస్తున్నదా? కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తున్నరా? యువతులకు స్కూటీలు ఇచ్చారా? నిరుద్యోగులకు రూ.5 లక్షల నిరుద్యోగ భృతి కార్డులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఓటమి భయంతో సీఎం రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు రద్దు చేయాలని చూస్తే, ఇదే జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతారని హెచ్చరించారు. ఎగిరెగిరి పడ్డ ఎంతోమంది నియంతలకు బుద్ధి చెప్పిన చరిత్ర తెలంగాణ గడ్డకు ఉన్నదని గుర్తుచేశారు. దీనికి రేవంత్‌రెడ్డి కూడా మినహాయింపు కాదని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమైపోయిందని అన్నారు. ఇప్పటివరకు వచ్చిన సర్వేలన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. గత ఎన్నికల్లో వచ్చిన దానికంటే రెట్టింపు మెజార్టీ రాబోతోందని చెప్పారు. ఈ నెల 11వ తేదీన జూబ్లీహిల్స్‌లోని 4 లక్షల మంది ఓటేస్తే రాష్ట్రంలోని 4 కోట్ల మందికి మేలు జరుగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాకుండా ఓడిస్తే 500 రోజుల్లో మళ్లీ కేసీఆర్ సీఎంగా వస్తారని పేర్కొన్నారు. 2023లో గోపీనాథ్‌కు రహమత్ నగర్ డివిజన్ నుంచి ఆరువేల మెజార్టీ వచ్చిందని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే ఇప్పుడు 12 వేల మెజార్టీ వస్తదనే నమ్మకం ఉన్నదని అన్నారు. నవంబర్ 14న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి సునీతతో ఇక్కడే మళ్లీ సంబురాలు చేసుకుందామని ధీమా వ్యక్తంచేశారు.

ఒక్క సీటు కోసం ముఖ్యమంత్రి, 14 మంది మంత్రులు

జూబ్లీహిల్స్ ఒక సీటు కోసం ముఖ్యమంత్రి, 14 మంది మంత్రులు గల్లీ గల్లీ తిరుగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. రెండేండ్లలో ఒక్క మంచి పని అయినా చేశారా? గీ మంచి పనిచేసినం అని ఓట్లు అడిగే దమ్ము కాంగ్రెస్ నేతలకు ఉన్నదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం బాగుపడ్తదని నగర ప్రజలు పూర్తి మెజార్టీ ఇచ్చారని, హైదరాబాద్ మొత్తం గెలిచినా దురదృష్టవశాత్తు ఓడిపోయామని అన్నారు. 'శివమ్మ, పాపిరెడ్డి హిల్స్ (ఎస్పీఆర్)లో రూ. 500-600 కోట్ల విలువైన జాగాను గోపీనాథ్ కాపాడారు. ఇప్పుడు ఆ జాగాలోనే ఆటల పోటీలు, క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నయి. నీళ్ల సమస్యను గోపీనాథ్ పరిష్కరించారు. అన్నా అంటే నేనున్న అన్నట్టు గోపీనాథ్ ఉన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చి, చీరె పెట్టిన నాయకుడు గోపీనాథ్. ఆయన ఆకస్మిక మరణంతో పెండ్లి కూడా కాని ఇద్దరు ఆడపిల్లలు, కొడుకు ఆపదలో పడ్డారు. అలాంటి కుటుంబానికి కేసీఆర్ అండగా నిలబడ్డారు. ఈ ఆడబిడ్డను కేసీఆర్ మీ ముంగటికి పంపించారు. భర్త చనిపోయి 6 నెలలుగా కూడా కాలేదు. కార్యకర్తలను చూడగానే భర్త గోపీనాథ్ గుర్తొచ్చి సునీతమ్మ ఏడిస్తే కూడా కాంగ్రెస్ నేతలు రాజకీయం చేస్తున్నారు. చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. ఏడుపును కూడా రాజకీయం చేసిన అరాచక పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఒక్క ఆడబిడ్డను ఓడగొట్టడం కోసం సీఎం, 14 మంది మంత్రులు కాలుకు బలపం కట్టుకొని గల్లీగల్లీ తిరుగుతున్నారు. రెండేండ్లలో ఒక్క మంచి పని అయినా చేశారా? గీ పని చేసిన అని ఓట్లు అడిగే పరిస్థితి ఉన్నదా?' అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాదు..

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదని, ఓడిపోతామని రేవంత్‌రెడ్డికి కూడా అర్థమైందని కేటీఆర్ చెప్పారు. అందుకే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'గత పదేండ్లలో మేం కూడా ఎన్నో ఎన్నికల్లో పాల్గొన్నాం. కానీ, ఒకసారైనా మాకు ఓటేయక పోతే పథకాలు బంద్ చేస్తామని బెదిరించామా? కానీ రేవంత్‌రెడ్డి ప్రజలను బెదిరిస్తున్నారు. ఈ చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్తారు. ఎంతోమంది నియంతలకు బుద్ధిచెప్పిన చరిత్ర తెలంగాణ గడ్డకు ఉన్నది. రెండేండ్లలో ఏం చేశారని రద్దు చేయడానికి. మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని మాట తప్పారు. యువతులకు సూటీ అన్నారు. ఒక హామీని కూడా అమలు చేయలేదు. ఏమైనా అంటే ఫ్రీ బస్సు అంటారు. ఆడవాళ్లకు ఫ్రీ అంటారు, మగవాళ్లకు డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. కేసీఆర్ కిట్ లేదు, రంజాన్ తోఫా లేదు, క్రిస్మస్ గిఫ్ట్ లేదు, తులం బంగారం లేదు. అన్నీ రద్దయిపోయాయి. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు అన్నారు, ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని ఇవ్వలేదు. మైనార్టీలకు ఇచ్చిన ఒక హామీ కూడా అమలు చేయలేదు. ఓడిపోతామని రేవంత్‌రెడ్డికి కూడాఅర్థమైంది. రేవంత్‌రెడ్డి పదవి తాతాలికమే. రెండేండ్లు అయిపోయింది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాకుండా ఓడిస్తే 500 రోజుల్లో మళ్లీ కేసీఆర్ సీఎంగా వస్తారు. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలి

మాగంటి సునీతాగోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఒక చాన్స్ ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. 'ఆడబిడ్డ అంటే ఆదిశక్తి రూపం. మీకు అండగా నిలబడుతం. ఎస్పీఆర్‌హిల్స్‌లోనే స్టేడియం కడతాం దానికి గోపీనాథ్ పేరు పెడదాం. కాంగ్రెస్‌కు మోకా ఇస్తే వాళ్లేమో ధోకా ఇచ్చారు. రూ. 4వేల కోట్లు ఇస్తామని మోసం చేశారు. బీజేపీకి, కాంగ్రెస్‌కు మంచి సంబంధం ఉన్నది. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్‌తో ఉన్నది ఫేక్ బంధం. బీజేపీతో ఉన్నది పేగుబంధం. పిల్లను ఇచ్చిన మామను కూడా బండ బూతులు తిట్టిన వ్యక్తి రేవంత్‌రెడ్డి. సెటిల్‌మెంట్ చేసే బ్లాక్‌మెయిలర్ ఇప్పుడు సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నరు. సీఎం మంచిమాటలు చెప్తరని ప్రజలు ఆశిస్తరు. కానీ, పేగులు మేడలో వేసుకుంటా అంటాడు. నువ్వేమైనా బోటికొట్టేవాడివా? కేసీఆర్ ఉన్నప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్‌వన్ అయితే ఇప్పుడు లాస్ట్ ప్లేస్‌కు చేరుకున్నది. 11న మీరు ఓటేయకపోతే కాంగ్రెస్ నేతలు దొంగ ఓట్లు వేస్తారు. ఈవీఎంలో పై నుంచి మూడో నంబర్ ఉన్నది కారు గుర్తు. మిగితావి అన్ని బేకార్' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో రోడ్ షోలో పాల్గొన్న అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్..

ఎ.ఎం. న్యూస్, జూబ్లీహిల్స్:
బిఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ శనివారం టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో రహమత్ నగర్ డివిజన్లోని శ్రీరామ్ నగర్ చౌరస్తాలో జరిగిన రోడ్డు షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి, రహమత్ నగర్ మాజీ కార్పొరేటర్ షఫీతో పాటు లియాకత్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఒక్క ఆడబిడ్డను ఓడగొట్టడానికి ముఖ్యమంత్రి, 14 మంది మంత్రులు గల్లీ గల్లీలో తిరుగుతున్నారు అని అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా జూబ్లీహిల్స్ ప్రజలు నిన్ను నమ్మరు అని మాగంటి సునీత గోపీనాథ్ ని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ గెలుపు ను ఎవ్వరూ ఆపలేరు అని జూబ్లీహిల్స్ ప్రజలు అంటున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల సీనియర్‌నాయకులు, డివిజన్‌స్థాయినాయకులుకార్యకర్తలు మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న అభ్యర్థి వి.నవీన్ యాదవ్

ఏ. ఎం. న్యూస్. జూబ్లీహిల్స్:



ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా (జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ) శనివారం కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్.ఎ. అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ను వెంటబెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోరబండ బస్ స్టాప్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్,ఎంపీ మల్లు రవి ,ఎం పి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు ఈ కార్యక్రమం ప్రజానాయకుడు, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ను ఆశీర్వదించి మీరు గెలిపించాలని కోరారు గెలవగానే జరిగే విజయోత్సవ ర్యాలీకి ఇక్కడికి వచ్చి బోరబండను పీజేఆర్ బోరబండ గా మారుస్తానని మాట ఇచ్చారు.

## కీలకంగా మారనున్న డబల్ బెడ్ రూమ్ ఓట్లు

### - చర్చిస్తున్న పలువురు రాజకీయ విశ్లేషకులు

ఏ. ఎం. న్యూస్. జూబ్లీహిల్స్:



సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం కొల్లూరు లో గత ప్రభుత్వ హయాంలో జంట నగరాల నుండి లబ్ధి పొందిన డబల్ బెడ్ రూమ్ ఫేస్ వన్(1), ఫేస్ టు(2),ఫేస్ త్రి(3) (రెండు పడకల సముదాయం ఫేస్ 1,,ఫేస్ 2,ఫేస్ 3,) వాసులు ఈ నెల ( నవంబర్ 2025) 11 తారీఖు జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో వారి ఓట్లు కీలకంగా మారనున్నాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఏ. ఎం. న్యూస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రిపోర్టర్ వారిని సంప్రదిస్తే వారి సమాచారం ప్రకారం కొల్లూరు ఫేస్ 1 లో 500 మంది కుటుంబాలు ఫెస్ 2 లో 2200 కుటుంబాలు (జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని 6 1/2 డివిజన్) లు నివాసం ఉంటున్నారని వారు అభిప్రాయపడ్డారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో జరిగే ఉప ఎన్నిక లో అభివృద్ధి మంత్రం పనిచేస్తుందా, సానుభూతి మంత్రం పనిచేస్తుందా అనేది 13 రోజులు వేచి చూడాలి.

## అక్రమ కేసులతో మహిళలను భయపెడుతున్నారు

**అమీర్‌పేట :**



తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేసే మహిళలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. గతంలో భారత రాష్ట్ర సమితి చేసిన మాదిరిగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహిళలను భయపెట్టేలా వ్యవహరిస్తోందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డలో రాష్ట్ర భాజపా మహిళా మోర్చా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు మజ్లిస్‌కు వంగి సలాం కొడుతున్నాయి. హైదరాబాద్‌ను సింగపూర్, ఇస్తాంబుల్‌లా మారుస్తానని చెప్పిన కేసీఆర్ చివరికి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. రెండు పడక గదుల ఇళ్ల పేరిట దగా చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ నియోజకవర్గం తీవ్రమైన సమస్యల్లో ఉంది. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు యువతకు రూ.4 వేలు, మహిళలకు రూ.2500, స్కూటీలు, తులం బంగారం, పావలా వడ్డీ రుణాలు ఏమయ్యాయి? మోసం చేసి మళ్లీ ఓట్ల కోసం వస్తున్న భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ నాయకులను మహిళలు నిలదీయాలి. బంగారు తెలంగాణ అని చెప్పిన కేసీఆర్ తన కుటుంబాన్ని మాత్రమే బంగారం చేసుకున్నారు. మహిళలు, రైతుల గురించి అనుక్షణం ఆలోచిస్తున్నది ప్రధాని మోదీ మాత్రమే. ప్రజల కోసం నిరంతరం ఆలోచించే భాజపాకు ఓటెయ్యాలి" అని ఆయన అభ్యర్థించారు. సమావేశంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎస్.సునీత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌ఛార్జి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా దేశానికే గర్వకారణం: కిషన్‌రెడ్డి

50 ఏళ్లుగా దేశానికి కోల్ ఇండియా ఎనలేని సేవలు అందించిందని.. ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీగా ఎదిగిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కోల్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కోల్‌కతాలో శనివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ఆన్‌లైన్‌లో పాల్గొని ప్రసంగించారు. కోల్ ఇండెక్స్ ఆధారిత ట్రేడింగ్ విధానం ద్వారా బొగ్గు ధరల్లో పారదర్శకత తీసుకొచ్చామని చెప్పారు.

# ఓయూలో బిసిల ధర్మ దీక్షను విజయవంతం చేసిన ఓయూ బిసి జేఏసీ

ఏ ఎం న్యూస్ ఓయూ:

ఓయూలో బిసిల ధర్మ దీక్షను విజయవంతం చేసిన ఓయూ బిసి జేఏసీ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో బీసీల ధర్మదీక్షను ఓయూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీల ధర్మదీక్షను రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఓయూ బిసి విద్యార్థి నాయకులకు పూలదండలను వేసి ప్రారంభించడం జరిగింది. ఈ దీక్షకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్ మద్దతుగా వచ్చారు. ఓయూ అధికారులు దీక్షను భగ్నం చేయడానికి కుట్రలు పన్నినందుకు నేల మీద కూర్చొని ఓయూ అధికారులకు నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతు బీసీలకు పార్టీ పరంగా కాకుండా చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ







దీక్షకు మద్దతుగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం, పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గటిక విజయ్ కుమార్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్, ప్రొఫెసర్లు గాలి వినోద్ కుమార్, రాములు, రమేష్ షఫర్డ్,టీపీసీసీ జనరల్ సెక్రటరీ మధు సత్యం గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేశం నాగరాజు గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంత రావు దీక్షకు మద్దతు తెలిపి, నిమ్మ రసం ఇచ్చి ఈ దీక్షను విరమింపజేశారు. ఈ ధర్మ దీక్షలో పాల్గొన్న విద్యార్థి నాయకులు బొల్లెపల్లి స్వామి గౌడ్,వట్టికూటి రామారావు గౌడ్, అల్లుడు జగన్ ముదిరాజ్,రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, బైరు నాగరాజు గౌడ్, నక్క శ్రీశైలం యాదవ్, సాంబ శివ గౌడ్, రమేష్ ముదిరాజ్, ప్రశాంత్, ఎస్ నాగేశ్వర్ రావు, ఆర్ఎల్ మూర్తి, లింగస్వామి,అరుణ్ కుమార్, కాంపాటి వెంకట్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్స్ యూనియన్ ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా.. ఓయూ విద్యార్థి నాయకుడు డా.వీరమల్ల శ్రీశైలం...

ఏ ఎం న్యూస్ ఓయూ:



న్యూ ఢిల్లీలోని IGNOU యూనివర్సిటీలో IGNOUTA (T) (టీచర్స్ యూనియన్) ఎన్ని కల్లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా పూర్వ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు డా.వీరమల్ల శ్రీశైలం, ఇగ్నో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ 150 ఓట్ల అత్యధిక ఆధిక్యంతో విజయం సాధించారు. డా.వీరమల్ల శ్రీశైలం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకునిగా తెలం గాణ ఉద్య మంలో చురుకైన పాత్ర పోషించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడుగా, జాతీయ కార్యవర్గ సభ్యుడుగా అనేక బాధ్యతలు నిర్వర్తించి విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. స్వ గ్రామం వెలిమినేడు, చిట్యాల మండలం, నల్గొండ జిల్లాలో వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్న కంపెనీలను మూసివేయాలని అనేక ఉద్యమాలు చేశారు. ఇకపై సమాజ నిర్మాణం, యూనివర్సిటీ ప్రొఫెసర్ల సమస్యలు, విద్యా సంస్కరణలపై నిర్మాణాత్మక భూమిక పోషించనున్నట్లు తెలిపారు. వారికి ప్రొఫెసర్లు, ఉద్యోగులు, బంధు మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చలో హైద్రాబాద్..: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

ఏ ఎం న్యూస్ ఓయూ:




పద్మశ్రీ. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నవంబర్ 01-11-2025 చలో హైద్రాబాద్ కార్యక్రమంలో భాగంగా ఇందిరాపార్క్ (ధర్నా చౌక్) దగ్గర నుండి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం (బషీర్బాగ్) వరకు ర్యాలీ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా నాయకులు కోరపాక అంజి మాదిగ ఉప్పల్ నియోజకవర్గం కో- ఆర్డినేటర్లు ఏర్పుల నాగరాజు మాదిగ మరియు చిదురల యాకస్వామి ఆధ్వర్యంలో జస్టిస్ గవాయ్ పై దాడి నిరసనగా ఆత్మగౌరవ ప్రదర్శన కార్యక్రమానికి నాచారం శ్రీమూర్తి నాగరాజ్ అధ్యక్షతన నాచారం నుండి పెద్ద ఎత్తున MRPS నాయకులు తరలి వెళ్లి ఈ యొక్క నిరసన ప్రదర్శనను విజయవంతం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏర్పుల నర్సింగరావు మాదిగ, పొన్నాల మహేందర్ మాదిగ, యల సంతోష్ మాదిగ, కుంటి రమేష్ మాదిగ,మధు మాదిగ మరియు MRPS నాయకులు పాల్గొన్నారు.

## బోరబండలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో

# పాల్గొన్న ఎమ్మెల్యే, ఇంచార్జ్ చిక్కుడు వంశీకృష్ణ..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాగంగా శనివారం బోరబండ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం) బస్టాండ్ వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ను పక్కన పెట్టుకొని ప్రచారంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ను గెలిపించాలని సభకు వచ్చిన ప్రజలను కోరారు. విజయోత్సవ ర్యాలీకి మళ్లీ మీ ముందుకు ఇక్కడికి వస్తానని వచ్చినప్పుడు బోరబండ చౌరస్తాను. పి జె ఆర్ చౌరస్తాగా మారుస్తానని మాట ఇచ్చారు ఈ కార్యక్రమం బోరబండ కార్పొరేటర్ బాబా ఫసి యుద్ధం ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమం లో బోరబండ ఇంచార్జ్ నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాల్గొన్నారు.

# హంగు అర్భాటాలతో నూతన వసతి గృహాల ప్రారంభం

## – కానీ విద్యార్థులు ఇబ్బందుల్లోనే!

ఏ ఎం న్యూస్ ఓయూ:



CPGETలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు పొంది ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిజీ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందిన పేద, బడుగు, బలహీన వర్గాల,మారుమూల ప్రాంతాల విద్యార్థు లకు అక్టోబర్ 13నుంచి తరగతులు ప్రారంభమైనప్పటికీ, ఇప్పటివరకు హాస్టల్ వసతి కల్పించక పోవడం వల్ల విద్యార్థులు తరగతులకు హాజరు కానీ పరిస్థితి నెలకొన్న అధికారులు ఏం మాత్రం ఆలోచించక పోవడం నిజంగా బాధాకరం. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిచే హంగు ఆర్భాటాలతో నూతన వసతి గృహాల ప్రారంభోత్సవం జరిగినప్పటికీ, విద్యార్థులు ఇప్పటికీ ప్రాథమిక వసతుల కోసం తంటాలు పడుతున్నారు. కొత్త భవనాలను ప్రారంభించినప్పటికీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం వల్ల విద్యార్థులకు ఇప్పటివరకు గదులు కేటాయించలేదు. పరీక్షలు జరుగుతున్న సమయంలో యూనివర్సిటీ ప్రాంగణం అంతా ఇనుపకంచెలతో, బార్ గేట్స్ తో నింపి, విద్యార్థులను స్తంభింప చేసినటువంటి పరిస్థితి ముఖ్యమంత్రి మీద ఉన్నటువంటి చిత్తశుద్ధి విద్యార్థుల పట్ల లేకపోవడం నిజంగా సిగ్గు చేటు. నూతన భవనంలో ఉండాల్సిన ప్రాథమిక వసతులు బెడ్లు, ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు, మరియు మెస్ సదుపాయాలు ఏవీ అందుబాటులో లేవు. అయినా కూడా ఈ వసతి గృహాలను కేవలం ఫోటోలు, ప్రచారాల కోసం ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా హాస్టల్ సౌకర్యాలు సరిపోక అనేక మంది విద్యార్థులు బయట గదులు అద్దెకు తీసుకుని ఉంటున్న పరిస్థితి యూనివర్సిటీలో నెలకొంది.అయ్యిన అధికారుల్లో ఏం మాత్రం చలనం లేకపోవడం విడ్డూరకరం.ఉస్మానియా యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన ప్రతి ఒక విద్యార్థికి హాస్టల్ సదుపాయం ఇవ్వాలి.ఇప్పటికైన అధికారులు స్పందించి యూనివర్సిటీలో నూతనంగా అడ్మిషన్ పొందిన పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు వెంటనే హాస్టల్ సదుపాయం కల్పించాలి.

# సంగారెడ్డి జిల్లా ఎస్ ఇ పదవీ విరమణ...

## ఘనంగా వీడ్కోలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




సంగారెడ్డి జిల్లా విద్యుత్ సూపరిండెంట్ ఇంజనీర్ (ఎస్ ఇ) శ్రీనాథ్ పదవి విరమణ చేశారు. సంగారెడ్డిలోని ఐఐటి ఆడిటోరియంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు బి . వెంకటేశ్వర్లు. ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సి ఇలతోపాటు ఎస్ ఇ లు వెంకన్న, మోహన్, రవికుమార్ మరియు డి ఇ జనప్రియ, ఏడీఇలు, ఎఇలు పాల్గొన్నారు.

# లులు మాల్‌లో ఫ్రాగ్రెన్స్ ఫెస్ట్ ప్రారంభం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న సినీ హీరోయిన్ కామ్నా జెత్మలానీ

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




హైదరాబాద్‌లోని లులు మాల్‌లో లులు ఫ్రాగ్రెన్స్ షోకేస్ 2025 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్య క్రమానికి ప్రముఖ సినీ హీరోయిన్ కామ్నా జెత్మలానీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రీజినల్ మేనేజర్ మహమ్మద్ షరీఫ్, లులు యాజమాన్యంతో కలసి ఆమె ఈ షోకేస్ ను శనివారం ప్రారంభించారు. శనివారం నుండి తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ షోకేస్ లో బ్లష్, నైకా, బ్యూటీ అండ్ న్యూట్రీ కి చెందిన టామ్ ఫోర్డ్, చానెల్, సీకే లాంటి అంతర్జాతీయ బ్రాండ్లు టైటాన్ కి చెందిన స్కిన్, మేక్ యువర్ ఓన్ పెర్ఫ్యూమ్, ఇబడి, ది మ్యాన్ కంపనీ లాంటి దేశీయ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులు ఆకర్షణీయమైన తగ్గింపు ధరలకే అందుబాటులో ఉన్నట్టు రీజినల్ మేనేజర్ షరీఫ్ చెప్పారు. తర్వాత లులు మాల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన షాప్ అండ్ విన్ కాంటెస్ట్ లక్కీ డ్రాను హీరోయిన్ జెత్మలానీ తీసి కస్టమర్లు, లులు యాజమాన్యం సమక్షంలో విజేతలను ప్రకటించారు. ఇందులో బహుమతులు గెలుపొందిన వారి వివరాలను లులు అన్ని సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ లో పోస్ట్ చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు లులు మాల్ ఫుడ్ కోర్ట్ లో ఫెస్టివల్ ఆఫ్ ఫ్లేవర్స్ సీజన్ – 2 నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు ఫుడ్ కోర్ట్ లో వివిధ రకాల ఆహార పదార్థాలపై ఆఫర్లు ఉంటాయని మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ తెలిపారు. "డైన్ అండ్ విన్" పేరుతో కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కనీసం 499 లేదా అంతకంటే ఎక్కువ విలువైన పదార్థాలు కొనుగోలు చేసే కస్టమర్లు సుజుకి అవెనిస్ స్కూటర్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు అత్యుత్తమ షాపింగ్ అనుభవాన్ని ఎప్పుడూ అందిస్తామని పేర్కొన్నారు.

# అర్హత ఉన్న అధ్యాపకులందరికి ప్రమోషన్స్ ఇవ్వాలి

## –ఔటా అధ్యక్షుడు ప్రొ.మనోహర్రావు


ఏ ఎం న్యూస్ ఓయూ:




అర్హత ఉన్న ఆధ్యాపకులకు ప్రతిభ లేదు. నైపుణ్యం లేదంటూ ప్రమోషన్స్ ను నిరాకరించడానికి ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) తీవ్రంగా ఖండిస్తుందనీ ఔటా అధ్యక్షులు ప్రొఫెసర్ మనోహర్రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఓయూ కామర్స్ కాలేజీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించిన అధ్యాపకులు నిరసన వ్యకత చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి అధ్యాపకులు నిరసన తెలియజేస్తున్నా యూనివర్సిటీ అధికారుల్లో కానీ, ప్రభుత్వ అధి కారుల్లోనూ చలనం లేదన్నారు. సీఏఎస్ ఇంటర్వ్యూల్లో తప్పిదాలు యూనివర్సిటీ అధికారుల వల్లనే జరిగాయాన్నారు. కావునా యూనివర్సిటీ అధికారులు చొరవ తీసుకుని తప్పిదాన్ని సరి చేయాలనీ డిమాండ్ చేశారు. గత నెల రోజుల నుంచి అధ్యాపకులు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూనే ప్రమోషన్స్లో జరిగిన అన్యాయంపై తగిన న్యాయం చేయాలనీ కోరుతూ అధ్యాపకులుగా వ్యక్తిగతం గాను, ఔటా ద్వారా సైతం ప్రభుత్వం పెద్దలకు, అధికారులకు, యూనివర్సిటీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించామనీ తెలియజేశారు. కావునా ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు రమేష్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆపర్ణ, సంధ్యారెడ్డి తదితరులున్నారు.

# అయ్యప్ప దీక్షను స్వీకరించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



హరిహరపుత్ర శ్రీ అయ్యప్ప స్వామి మాల ధరించి నియమాలతో కూడిన దీక్షను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శనివారం ఉదయం చేపట్టారు. కూకట్ పల్లీ వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి దివ్యదర్శనము చేసుకొని అయ్యప్ప స్వామి ఆలయ అర్చకులు యోగి గురుస్వామి కైంకర్యములచే మాలను ధరించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తితో పాటుగా మనసుకు పవిత్రతను, ఆత్మశాంతిని ప్రసాదిస్తుందనీ చెప్పారు. ప్రతి సంవత్సరం స్వామి వారి మాలధారణ ద్వారా శరీరం, మనసు, ఆత్మ శుద్ధి సాధించడానికి ఇది ఒక ఆధ్యాత్మిక సాధనగా పేర్కొన్నారు. నియమ నిష్ఠలతో దీక్షను ఆచరించడం ద్వారా జీవితంలో నియంత్రణ, క్రమశిక్షణ భక్తి పెంపొందుతాయని వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి అన్నారు.

# నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్

## మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఆలుమ్ని అసోసియేసన్ నియామకం

## గౌరవ అధ్యక్షులుగా రాందేవ్ రావ్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఆలుమ్ని అసోసి యేసన్‌ను నియమించారు. తెలంగాణఅధ్యక్షులుగా రాందేవరావ్ ఆసుపత్రి సీఈవో డా.ఎన్. యోబు ఎన్నికయ్యారు. ఈ అసోసియేషన్ లక్ష్యం ఎంహెచ్ఎం పూర్వ విద్యార్థుల మధ్య బలమైన అనుబం ధాన్ని ఏర్పరచడం, విద్యా, వృత్తి పరమైన పరస్పర సహకారాన్ని పెంపొందిం చడం, అలాగే ఆసు పత్రి నిర్వహణలో నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఒంటి కార్యక్రమాలు చేపడ తారు. అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కె. శరత్, ప్రధాన కార్యదర్శి వై అనుదీప్, సంయుక్త కార్య దర్శిగా కె. ఉద్ధిత్ సాత్విక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాగ విద్యా, కోశాధికారిగా బి. రణ శేషు, కార్యనిర్వాహక సభ్యులుగా తబస్సుమ్, సోఫియా, రఘువరన్,నవిత, వేదవ్యాసవర్ధన్ ఎన్నికయ్యారు.

## మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి

# కార్యక్రమంలో పాల్గొన్న మానికేశ్వర్ నగర్ నేతలు..

ఏ ఎం న్యూస్ ఓయూ:




దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మంత్రి అజారుద్దీన్ తదితరులు కార్యక్రమానికి హాజరై ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మానికేశ్వర్ నగర్ కు చెందిన డిసిసి జనరల్ సెక్రెటరీ వరికుప్పల రవి, సికింద్రాబాద్ పార్లమెంటు ఉపాధ్యక్షులు ఆలకుంట లింగయ్య తదితరులు వెళ్లి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు.

# నారాయణ స్కూల్స్ జోనల్ ఆధ్వర్యంలో క్రీడా మహోత్సవం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




నారాయణ పాఠశాలలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నారాయణ ప్రీమియర్ లీగ్ (ఎన్.పి.ఎల్) ఆటల పోటీలు కె.పి.హెచ్.బి జోన్ లోని ఆరు పాఠశాలల (భౌరంపేట,ప్రగతి నగర్, కె.పి.హెచ్.బి 1, 2, శంషిగూడ, చింతల్ ) మధ్య భౌరంపేట స్కూల్ గ్రౌండ్ లో శనివారం నాడు దిగ్విజయంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థులలో చురుకుదనం, జట్టు భావన, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యం. ఈ సందర్భంగా పాటల పోటీలలో పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్కూల్ ప్రిన్సిపాల్స్ ఎజిఎం వైజయంతి మాట్లాడుతూ భవిష్యత్తులో తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. విజేతలకు ట్రోఫీలు బహూకరించి అభినందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల శారీరక ధృఢత్వాన్ని మానసిక పరిణతిని పెంచుతున్నాయని ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రచారం నిర్వహిస్తూ వి. నవీన్ యాదవ్‌ని కలిసిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బాపు మలిశెట్టి, వారి టీం

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :





తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పెద్దలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వి. నవీన్ యాదవ్ గెలుపుకై ఎన్నికల ప్రచారానికి పంపించిన తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మలిశెట్టి, తనకిచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ రహమత్ నగర్ డివిజన్ ఓంనగర్, బ్రహ్మ శంకర్ నగర్, బ్రహ్మంగారి ఆలయ పరిసర ప్రాంతాల్లో, తన టీం తో కలిసి కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ లో చేసిన అభివృద్ధి కరపత్రాలు పంచుతూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో శనివారం అభ్యర్థి వి. నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రజల్లో ఉన్న స్పందనను వారికి వివరించారు మీరే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వారికి వచ్చిన సమాచారం తెలిపారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజయ్య గౌడ్, యూసుఫ్ గూడా డివిజన్ వెంకటగిరి ప్రాంతానికి చెందిన శంకరయ్య, తో పాటు కుర్మన్న పాల్గొన్నారు.

# చోరీకి గురైన సెల్ ఫోన్లు రికవరీ

## ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోర్టల్ ద్వారా సెల్ ఫోన్‌లో రికవరీ

ఏ ఎం న్యూస్ /హైదరాబాద్:






నార్త్ జోన్ పరిధిలో చోరీకి గురైన సెల్ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అప్పగించినట్టు డిసిపి రష్మీ పెరుమాళ్ వెల్ల డించారు. డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ చాలాకాలంగా సెల్ ఫోన్లు చోరీకి గురవుతున్నట్టు ఆయా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు నమోదు అవుతున్నాయని ఈ క్రమంలో చోరీలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు ఆమె వెల్లడించారు. మొబైల్ నెంబర్ ఆధారంగా ప్రత్యేక పోర్టల్ని ఏర్పాటు చేసి ట్రాక్ చేయడం జరిగిందని, సంబంధిత ఐడెంటిటీ రిజిస్టర్ (CEIR) పోర్టల్ ద్వారా 118 కి పైగా మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నార్త్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుండి మొత్తం 111 మంది ఫిర్యాదు దారులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా వారి మొబైల్ ఫోన్‌లను తిరిగి వారికి అందజేయడం జరిగిందన్నారు. నేరాలను ఎదుర్కోవడం మరియు పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను తిరిగి పొందడం లో నార్త్ జోన్ పోలీసుల కృషిని ఆమె అభినందించారు. స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లను వాటి నిజమైన యజ మానులకు, బాధితులకు అప్పగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌లను ట్రాక్ చేసి తిరిగి వారికి అప్పగించడం జరుగుతుందని ఆమె వెల్లడిం చారు. పోయిన సెల్ ఫోన్లు తిరిగి తమకు దక్కడంతో ఫిర్యాదారులు ఆనందం వ్యక్తం చేశారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బి.ఆర్.ఎస్ విజయం కోసం గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు విస్తృత ప్రచారం...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




జూబ్లిహిల్స్ నియోజక వర్గంలో ఉప ఎన్నికల సందర్భంగా బి.ఆర్.ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపే లక్ష్యంగా బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు ఆధ్వ ర్యంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ ఇన్చార్జ్ కూకట్పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణ రావు ఆదేశాల మేరకు ఎర్రగడ్డ డివిజన్ లోని పలు కాలనీల్లో కారు గుర్తుకు ఓటు వేయలంటూ డోర్ టు డోర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఇతర టిఆర్ఎస్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.